సూపర్‌సిక్స్ పథకాల పేరుతో మోసం

తన్నీరు నాగేశ్వరరావు



జగ్గయ్యపేట మండలం గౌరవరంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

జగ్గయ్యపేట: సూపర్‌సిక్స్ పథకాల పేరుతో కూటమి నేతలు, ప్రజలను మోసం చేశారని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన మేరకు కూటమి పాలకులు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జగ్గయ్యపేట మండలంలోని గౌరవరం, పోచంపల్లి గ్రామాల్లో సోమవారం 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమంపై విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. మేనిఫెస్టోలో చెప్పిన పథకాలను అమలుచేయకుండా సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి పాలకులు చేస్తున్న మోసంపై పార్టీ నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా తన్నీరు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పథకాలు అమలుచేయకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. ఇచ్చిన హామీలు అమలుచేయకుండా సీఎం చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బూడిద నరసింహారావు, గ్రామ కన్వీనర్లు ఆదోని కిషోర్, బూతుకూరి కొండారెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ అన్నాబత్తుల శ్రీనివాసరావు, మండల యూత్ కన్వీనర్ మందడపు జగదీష్, జిల్లా కార్యదర్శి చల్లా వైకుంఠరావు, నాయకులు చింతకుంట్ల వెంకటరెడ్డి, షేక్ బడేమియా, బత్తుల రామారావు, బూతుకూరి రంగారెడ్డి, నాగిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పథకాల అమలుకు డిమాండ్...

వత్సవాయి: సార్వత్రిక ఎన్నికల్లో మేనిఫెస్టోలో పేర్కొన్న పథకాలను కూటమి పాలకులు అమలుచేయాలని వైఎస్సార్ సీపీ వత్సవాయి మండల అధ్యక్షుడు గుత్తా శంకరరావు డిమాండ్ చేశారు. మండలంలోని పాత వేమవరం, కొత్తవేమవరం, ఆళ్లూరుపాడు గ్రామాల్లో సోమవారం 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం అధికారంలోనికి రావడం కోసమే టీడీపీ, జనసేన, బీజేపీలు ఇష్టారీతిన హామీలు ఇచ్చి.. తీరా అధికారంలోకి వచ్చాక ఆ పథకాలను అమలుచేయడం లేదన్నారు. రాష్ట్రంలోని అన్నివర్గాల వారిని ఒకేసారి మోసం చేసిన ఘనత సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికే దక్కిందని విమర్శించారు. ఆయా పథకాల అమలుపై డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రజల తరఫున ప్రశ్నిస్తానని చెప్పి మిన్నకుండిపోవడంలో అంతర్యమేమిటని డిమాండ్ చేశారు. వేమవరం గ్రామ పార్టీ అధ్యక్షులుగా పూర్ణకంటి వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి నంబూరి రవి, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు నరమనేని వెంకటేష్, ఆళ్లూరుపాడు సర్పంచ్ యలమర్తి నరేంద్ర, రూప్లానాయక్, మాదాల రంగయ్య, కొట్టె నగేష్, మిట్టకోలు నరేష్, యేశపోగు శ్రీనివాస్, గింజుపల్లి మధు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబువి మాయమాటలు..

జగ్గయ్యపేటఅర్బన్: సీఎం చంద్రబాబు ప్రతిసారీ మోసపూరిత మాటలు చెప్పి ఓట్లు వేయించుకుని ప్రజలను మోసం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్ విమర్శించారు. పట్టణంలోని 10, 11వ వార్డుల్లోని దుర్గాపురం, సీతారామపురం, 14వ వార్డు విలియంపేటలో సోమవారం 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిరోజ్‌ఖాన్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మాయ మాటలు చెప్పి ఓట్లు వేయించుకోవడం, గెలిచి అధికారంలోకి వచ్చాక ఆహామీలను తుంగలో తొక్కడం సీఎం చంద్రబాబుకు అలవాటుగా మారిందన్నారు. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా, వైఎస్సార్ సీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి పింగళి నర్సింహారెడ్డి, ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాణావత్ రాజు, పట్టణ ఎస్సీ సెల్ నాయకుడు ఉప్పెల్లి పెంటయ్య, పట్టణ యూత్ అధ్యక్షుడు రామిని ఉపేందర్‌రెడ్డి, పట్టణ మహిళా అధ్యక్షురాలు షేక్ మున్నీహీరా, పట్టణ వలంటీర్ విభాగం అధ్యక్షుడు ఇమ్రాన్ పాషా, పట్టణ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బాలస్వామి, స్థానిక నాయకులు షేక్ ఖాదర్, సంపంగి గోపాలకృష్ణ, దేవరశెట్టి వీరాంజనేయులు, దారెల్లి రాజు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చే వరకు పోరాటం...

వీరులపాడు: సూపర్ సిక్స్ పథకాల పేరుతోకూటమి నేతలు ఇచ్చిన హామీలను వారు అమలుచేసే వరకు ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందని ఆపార్టీ వీరులపాడు మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జయంతి గ్రామంలో సోమవారం 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'పై గ్రామస్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఓట్ల కోసం ఇష్టారీతిన హామీలు గుప్పించి, తీరా అధికారంలోకి వచ్చాక అమలుచేయకపోవడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక పీ4 సర్వేతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలకు ప్రజల నుంచి విశేష మద్దతు వస్తుండటంతోపాటు కూటమి ప్రభుత్వ మోసాలపై ఆయన నిలదీస్తుండటంతో, వైఎస్సార్ సీపీ నేతలను అక్రమంగా అరెస్ట్‌చేస్తూ కూటమి పాలకులు డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. కూటమి పాలకుల మోసాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జయంతి గ్రామ కన్వీనర్‌గా నరెడ్ల శ్రీనివాసరెడ్డిని నియమించినట్లు ఆవుల రమేష్‌బాబు, కోటేరు ముత్తారెడ్డి తెలిపారు. గ్రామ కన్వీనర్‌ను నాయకులు, కార్యకర్తలు సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మారపాక మహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు ఇప్పల సత్యనారాయణ రెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ జంగా కోటిరెడ్డి, నాయకులు నువ్వుల విశ్వనాథం, మారపాక శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వత్సవాయి మండలం వేమవరంలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



వీరులపాడు: జయంతి గ్రామంలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



జగ్గయ్యపేటలో 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ' క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న పఠాన్ ఫిరోజ్‌ఖాన్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ హఫీజున్నీసా, పార్టీ నేతలు

క్లుప్తంగా

శంభులింగేశ్వరునికి ప్రత్యేక పూజలు



నందిగామరూరల్: మండలంలోని గోళ్లమూడిలో వేంచేసియున్న గంగా పార్వతీ సమేత శంభులింగేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం తొలి సోమవారం సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గండేపల్లిలో శానిటేషన్ పనులు



కంచికచర్ల : సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలుగా గండేపల్లి పంచాయతీ పరిధిలో శానిటేషన్ పనులు చేపట్టినట్లు సర్పంచి బొక్కా రవికుమార్ తెలిపారు. గండేపల్లిలో అన్ని వీధుల్లో సోమవారం చేపట్టిన సున్నం, బ్లీచింగ్ పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలు కురిసినందున గ్రామంలో పారిశుద్ధ్య మెరుగుదలకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. డ్రైనేజీల్లో మురుగునీరు ముందుకు సాగేలా ప్రత్యేకచర్యలు తీసుకున్నామన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఎబేట్‌ను కూడా పిచికారీ చేయించినట్లు వివరించారు. ప్రజలు కూడా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండి ఇంటి ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన



నందిగామ రూరల్: ర్యాగింగ్ నిషేధమని, నిబంధనలకు విరుద్ధంగా ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలుంటాయని శక్తి టీం ఏఎస్ఐ హనుమయ్య హెచ్చరించారు. మండలంలోని మాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం శక్తి యాప్ వినియోగం, మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలు, ర్యాగింగ్ నిషేధం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు శక్తి యాప్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అత్యవసర సమయాలలో శక్తి యాప్ భద్రత కల్పిస్తుందన్నారు. ప్రతి ఒక్కరు తమ మొబైల్ ఫోన్‌లలో యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం జీవితాన్ని నాశనం చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, శక్తి టీం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గోదాదేవి జన్మనక్షత్ర వేడుకలు



నందిగామరూరల్: మండలంలోని ఆయా ఆలయాలలో సోమవారం గోదాదేవి జన్మనక్షత్ర వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని పల్లగిరి గట్టుపై వేంచేసియున్న కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో గోదాదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష అర్చనలు, తులసీ దళ అర్చనాది పూజలు చేశారు. పట్టణంలోని చెన్నకేశవ స్వామి లయం, సీతారామాంజనేయ స్వామి ఆలయాల్లో అర్చకులు దివి శశి వంశీ కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో వైఖానస సంప్రదాయం పద్ధతిలో గోదాదేవి జన్మనక్షత్ర వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆండాళ్ ఘోష్టి సభ్యులు నాంచార్ తిరువాయిముడి పారాయణ చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): బాలికను కిడ్నాప్ చేసిన కేసులో యువకునిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తోట సూర్యశ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. మండలంలోని షేర్‌మహ్మద్‌పేట గ్రామానికి చెందిన 17ఏళ్ల బాలిక తెలంగాణ రాష్ట్రం కోదాడలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది. ఈక్రమంలో ముదిగొండ మండలం వల్లభి గ్రామానికి చెందిన మేరుగ వీరబాబు అనే యువకుడు ఈనెల 25వతేదీ ఉదయం బాలికను కిడ్నాప్ చేయగా సాయంత్రం బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

పీజీఆర్ఎస్‌కు 17 అర్జీలు



అర్జీదారునితో మాట్లాడుతున్న నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ

నందిగామరూరల్: ప్రజాసమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకే ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) నిర్వహిస్తోందని ఆర్డీవో కె.బాలకృష్ణ తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించగా, ఆయా సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు అర్జీలు అందజేశారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 15 అర్జీలు అందినట్లు చెప్పారు. రెవెన్యూ శాఖకు సంబంధించి ఆరు అర్జీలు, సర్వే కోసం ఒకటి, విద్యాశాఖ ఒకటి, మున్సిపాలిటీ ఒకటి, ఇరిగేషన్ ఒకటి, రిజిస్ట్రేషన్ ఒకటి, పంచాయతీరాజ్ రెండు, పోలీస్ శాఖకు సంబంధించి రెండు అర్జీలు అందినట్లు తెలిపారు. ఆయా అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని వివరించారు.

జగ్గయ్యపేట మండలంలో..

చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో నితిన్ వత్సవాయి మండల ఇన్‌చార్జిగా ఉండటంతోపాటు కేంద్ర బృంద సభ్యులు రావడంతో వత్సవాయి వెళ్లారు. దీంతో డిప్యూటీ ఎంపీడీవో పద్మావతి, కార్యాలయ ఏవో మాధవశర్మ, వైద్యారోగ్యశాఖ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ పీజీఆర్ఎస్ నిర్వహించగా, ప్రజల నుంచి ఒక్క అర్జీ కూడా రాలేదు. అదే విధంగా జగ్గయ్యపేట ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్ తన కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి ఓ అర్జీ అందినట్లు ఆయన తెలిపారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు మాట్లాడుతూ తనభూమిని రాయించుకుని తనకు రావాల్సిన డబ్బులు ఇవ్వడం లేదంటూ మోగులూరు గ్రామానికి చెందిన ఓ రైతు అర్జీని అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటరెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ చట్టాన్ని సవరించి సబ్‌కోటా ఇవ్వాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళా రిజర్వేషన్ చట్టాన్ని సవరించి బీసీ మహిళలకు సబ్ కోటా ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం డిమాండ్ చేసింది. సోమవారం ధర్నా చౌక్‌లో బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఒక రోజు నిరాహార దీక్ష జరిగింది. మహిళా విభాగ అధ్యక్షురాలు సంకారపు జయశ్రీ, గౌరవాధ్యక్షురాలు వావిలాల సరళాదేవి మాట్లాడుతూ బీసీ మహిళలకు సబ్ కోటా ఇవ్వాలన్నారు. ఇందుకోసం మహిళా రిజర్వేషన్ చట్టాన్ని సవరణ చేయాలని కోరారు. 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత చట్టసభలలో 33 శాతంతో మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఆమోదించిందన్నారు. అయితే బీసీ మహిళలకు సబ్-కోటా కేటాయించకుండానే చట్టం చేసిందన్నారు. కేసన శంకరరావు, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ రిజర్వేషన్ చట్టానికి ఓబీసీ మహిళలకు సబ్‌కోటా ఇస్తూ సవరణ చేయాలని డిమాండ్ చేశారు.

సమస్యలు పరిష్కరించాలంటూ వినతి



కమిషనర్ వెంకటకృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న ధనంబోడు కాలనీవాసులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని 12వ వార్డు ధనంబోడు కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ కాలనీవాసులు సోమవారం మున్సిపల్ కమిషనర్ తులసి వెంకటకృష్ణారావును కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీవాసులు మాట్లాడుతూ డ్రైనేజీ సదుపాయం లేక మురుగు రోడ్లపైనే ప్రవహిస్తోందని కమిషనర్‌కు వివరించారు. డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, గృహాల మధ్య పిచ్చిమొక్కలు, కంపచెట్లను తొలగించాలని, కోతుల సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం కమిషనర్ వెంకటకృష్ణారావు స్పందిస్తూ త్వరలో ధనంబోడు కాలనీలో పర్యటిస్తాంచి ఆయా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని వారికి హామీ ఇచ్చారు. కమిషనర్‌కు వినతిపత్రం అందజేసినవారిలో గజ్జ శంకర్, దానబోయిన కాటమరాజు, దారెల్లి రాజు, రంగిశెట్టి సాయి, పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.2.50 లక్షలు స్వాహా


నిందితురాలిపై కేసు నమోదు

జగ్గయ్యపేటఅర్బన్: రైల్వేశాఖలో టీసీ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.2.50లక్షలు కాజేసిన మహిళపై జగ్గయ్యపేట పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు పట్టణంలోని సీతారామపురంనకు చెందిన చవట రాఘవేంద్రకుమార్‌కు, అనంతపురం పట్టణానికి చెందిన జక్కా లక్ష్మీకి కొంతకాలంగా పరిచయం ఉంది. ఈ క్రమంలో చవట రాఘవేంద్ర కుమార్ ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్న విషయాన్ని జక్కా లక్ష్మి గమనించింది. రైల్వేశాఖలో టీసీగా ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించిన లక్ష్మి, రాఘవేంద్రకుమార్ వద్ద నుంచి రెండున్నర లక్షల రూపాయలు తీసుకుంది. ఎంతకాలం వేచి చూసినా ఉద్యోగం ఇప్పించకపోవడంతో తన డబ్బులు తిరిగి ఇవ్వాలని ఆమెను కోరాడు. అయితే డబ్బులు తిరిగి ఇస్తానంటూ కొద్దినెలలుగా వాయిదా వేస్తుండటం, ఫోన్లు ఎత్తకుండా ఉండటంతో తాను మోసపోయానని గుర్తించాడు. దీంతో జగ్గయ్యపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు జక్కా లక్ష్మిపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.రాజు తెలిపారు.


ఒకటి నుంచి వైఎస్సార్ సీపీ విస్తృత సమావేశాలు

నందిగామరూరల్: చందర్లపాడు మండలంలోని ఆయా గ్రామాల్లో ఆగస్టు ఒకటోతేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ' కార్యక్రమంపై విస్తృతస్థాయి సమావేశాలను నిర్వహిస్తున్నట్లు నందిగామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు సోమవారం తెలిపారు. ఒకటోతేదీన గుడిమెట్ల, లక్ష్మీపురం, రెండున కాండ్రపాడు, కోనాయపాలెం, మూడున మునగాలపల్లి, తుర్లపాడు, నాలుగున తోటరావులపాడు, చింతలపాడు, ఐదున విభరింతలపాడు, పోపూరు. ఆరున కొత్తపాలెం, పున్నవల్లి, ఏడున కొడవటికల్లు, పాక్కునూరు, ఎనిమిదిన కాసరబాద, ఉస్తేపల్లి, తొమ్మిదో తేదీన బబ్బెళ్లపాడు, చందర్లపాడు గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.


కల్వర్టులకు మరమ్మతులు చేపట్టరూ..



కంచికచర్ల సమీపంలో నల్లవాగుపై ప్రమాదకరంగా ఉన్న రెయిలింగ్‌లేని కల్వర్టు



కీసర-దొనబండ వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుపై శిథిలావస్థకు చేరిన అడ్డదొంక వాగు కల్వర్టు



చెవిటికల్లు వద్ద ప్రమాదకరంగా ఉన్న లక్ష్మయ్య వాగు కల్వర్టు

కంచికచర్ల: కంచికచర్ల మండలంలోని ఆయా గ్రామాల పరిధిలో ఉన్న వాగులపై ఉన్న కల్వర్టులు శిథిలావస్థకు చేరడం ప్రమాదకరంగా మారింది. దశాబ్దాల కింద నిర్మించిన ఆయా కల్వర్టులకు ఏర్పాటు చేసిన రెయిలింగ్ దెబ్బతినగా, తరచూ ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటూ వాహనచోదకులు, ప్రజలు గాయాలపాలవుతున్నారు. ప్రస్తుతం వర్షాల సీజన్‌కావడంతో ఆయా వాగుల వద్ద శిథిలావస్థలో ఉన్న కల్వర్టులను చూసి ప్రజలు భయాందోళలకు గురవుతున్నారు. గతంలో చెవిటికల్లు లక్ష్మయ్యవాగు, కంచికచర్ల సమీపంలోని నల్లవాగు, కీసర సమీపంలోని కస్తవ వాగుల వద్ద చోటుచేసుకున్న ప్రమాదాల్లో కొందరు గల్లంతుకాగా, మరికొందరు గాయపడటమే ఇందుకు కారణం. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, ఇకనైనా కూటమి పాలకులు స్పందించి ఆయా వాగుల వద్దనున్న కల్వర్టులకు మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



శ్రీరంగనాయకస్వామి ఆలయంలో అమ్మవారు



పూజలు చేస్తున్న అర్చకుడు

జగ్గయ్యపేట అర్బన్: శ్రీఆండాళ్ తిరు నక్షత్రం సందర్భంగా సోమవారం పట్టణంలోని పలు ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పాలేటి తీరాన ఉన్న శ్రీచెన్నకేశవస్వామి దేవాలయంలో భగవద్రామానుజ గోష్ఠి ఆధ్వర్యంలో ఉదయం గోదా అమ్మవారికి తులసి దళాలతో శ్రీగోదా అష్టోత్తరం, పారాయణం, తిరు నక్షత్ర వేడుకలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. శ్రీరంగనాయకస్వామి ఆలయంలో ఆండాళ్ తిరునక్షత్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృత స్నపన, విశేష పూజలు, ప్రత్యేక అలంకరణ చేశారు. విజయవాడ రోడ్‌లోని శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు శ్రీరంగం శ్రీనివాసచార్యులు పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు.

పంచ జ్యోతిర్లింగ దర్శనం, అంబేడ్కర్ యాత్ర

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్(ఐఆర్‌సీటీసీ) ఆధ్వర్యంలో భారత దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన ఐదు జ్యోతిర్లింగాలను దర్శనంతో పాటు భారత రాజ్యంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యాత్ర పేరుతో భారత్ గౌరవ్ ప్రత్యేక పర్యాటక రైలును సికింద్రబాద్ నుంచి నిజామాబాద్ మీదుగా ప్రారంభించారు. ఆగస్టు 16 నుంచి 24వ తేదీ వరకు ఎనిమిది రాత్రుళ్లు, తొమ్మిది పగలు సాగే ఈ యాత్రలో నాగ్‌పూర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బౌద్ధమతాన్ని స్వీకరించిన ప్రదేశమైన దీక్షా భూమి, శ్రీ స్వామి నారాయణ మందిరం దర్శనం, ఉజ్జయినిలోని మహాకాళేశ్వర జ్యోతిర్లింగం, ఓంకారేశ్వర జ్యోతిర్లింగ దర్శనం, అంబేడ్కర్ జన్మస్థలం భీమ్ జన్మభూమి, నాసిక్‌లోని త్రయంబకేశ్వర జ్యోతిర్లింగం, పూణేలోని భీమశంకర్ జ్యోతిర్లింగం, ఔరంగాబాద్‌లోని గ్రిష్ణేశ్వర జ్యోతిర్లింగ దర్శనం కల్పించారు. ఈ ప్యాకేజీలో స్లీపర్ క్లాస్‌లో ఒక్కొక్కరికి పెద్దలకు రూ. 14,700, పిల్లలకు రూ.13,700, 3 ఏసీ క్లాస్‌లో పెద్దలకు 22,900, పిల్లలకు రూ.21,700, 2 ఏసీలో పెద్దలకు రూ.29,900, పిల్లలకు రూ. 28,400 ధర నిర్ణయించారు. ఆసక్తి కలిగిన యాత్రికులు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ లేదా విజయవాడలోని కార్యాలయం లేదా 92814 95848 ఫోన్ నంబర్ల ద్వారా టికెట్‌లు బుక్ చేసుకోవాలని సూచించారు.

కష్టపడే తత్వమే విజయానికి పునాది



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): కష్టపడే తత్వమే విజయానికి పునాది అని, ప్రతి ఒక్క విద్యార్థి కష్టపడే తత్వాన్ని అలవరచుకోవాలని చైతన్య విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ సూచించారు. చైతన్య(ఐఐటీ డేస్కాలర్) కళాశాల వార్షికోత్సవం కానూరులోని మన కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మురళీకృష్ణ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. గతేడాది ఎన్ఐటీ, ఐఐటీలో సీట్లు పొందిన విద్యార్థులను, వివిధ క్రీడా పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు అందచేసి అభినందించారు. చైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డీన్ ఆంజనేయులు, ఏజీఎం పీ.రామకృష్ణ, డీన్ రామశ్రీనివాస్‌తోపాటు ఐఐటీ డే స్కాలర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. సభ అనంతరం విద్యార్థులు తమ సాంస్కృతిక ప్రదర్శనలతో అందరినీ అలరించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నందిగామ డివిజన్
79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)
Office mail : sakshiads@gmail.com